


# స్లో పాయిజన్

పవని నిర్మలప్రభావతి

"పంతులూ! పంతులూ! ా అల్లుడేదో పలకడం లేదు. అన్న ్వి. ఏందో గుండెల్లో నొప్పన్నాడు. మ చంమీద పడిపోయాడు. పలకడంలేదు పంతులూ!"

రాత్రి ఎనిమిది గంటలు ొటుతుండగా, రామయ్య ఒగరుస్తూ, నా ్గరకు పరుగెత్తుకవచ్చాడు. క్షణకాలం ఆశ్చర్యం కలిగింది. సాయంత్రం ఏట ్టుకు షికారుకు వెళ్లివస్తుంటే, కోటే ె వేసివున్న కాడెద్దులను తోలుకువస్తూ కనిపించాడు రామయ్య. "మా అల్లుడు ంరసింహులు ఇందాక వచ్చాడు. వాడికి బెజవాడలో క్లీనరు పని వచ్చిందట. మా కూతురు సుబ్బు ్ను పిల్చుకుపోవటానికి వచ్చాడు. ఎల్లుం్ మంచిరోజుట. ఇద్దరూ ఎల్లుండి వెళతా ్, నువ్వారోజు కాయితం రాసిచ్చావు చూడు....దాంతో వాడికి ఉద్యోగం వచ్చిం్, ఎట్లైనా నీ "హస్తవాసి" మంచిది పంతులూ!" అన్నాడు సంతోషంగా.

నా హస్తవాసి గురించి నా కొట్టే నమ్మకం లేదు గానీ, పదుగురి శ్రేయస్సే, మన శ్రేయస్సుకు పునాది అన్న ప్రాథమిక సత్యంమీద మాత్రం తగని నమ్మకం వుంది. బెజవాడలోని నా స్నేహితుడికి "ఈ నరసింహులుకు ఫలానా వర్క్‌షాప్ చూపించగోరుతాను" అని ఇంగ్లిషులో వ్రాసి ఇచ్చిన ఉత్తరంతో, అతనికి ఉద్యోగం వచ్చిందని నమ్మేంతటి వెర్రివాణ్ణిగాను. కానీ, ఒక్కొసారి అనుకోని అపనిందల లానే, అయాచితమైన కీర్తి కూడా వస్తుంటుంది మనిషికి. మొదటిది తప్పనిసరిగా అనుభవించాలి. రెండోదాని కోసం పరుగులు తీయాలి. అదే తేడా.

"ఏదోలే! నీ కూతురు సుబ్బులు మొహంలో మంచి కళవుంది. నీ అల్లుడు

నరసింహులు మంచి కుర్రాడు. ఆ ఇద్దరి అదృష్టం. నాదేముంది మధ్యలో!'' అన్నాను నవ్వుతూ. ఇది జరిగి రెండున్నర గంటలు కాలేదు! ఈలోగా ఆ వార్త వినటం. ఏదో భయాన్ని రేకెత్తించింది నాలో.

రామయ్య అన్న కిష్టయ్య. అతని భార్య లక్ష్మమ్మ చాలా అందగత్తె. మహంకారి. రామయ్య భార్య కొండమ్మ కాపురానికి వచ్చిన తర్వాత, ఒక సంగతి తెలుసుకుంది. రామయ్య, లక్షమ్మలమధ్య కేవలం వదినా మరదులమధ్య వుండవలసిన పవిత్ర బాంధవ్యంగాక, అంతకుమించిన అక్రమ సంబంధం వుందని! ఆ సంగతి కిష్టయ్యకు తెలిసినా, తమ్ముడిని దూరంగా వుంచితే, ఆస్తి ముక్కలౌతుందనీ, తనొక్కడూ సేద్యపుబాటు జరపలేడనీ, శరీరకష్టం బాగా చేయగల తమ్ముడి తోడ్పాటు తనకూ, తన పిల్లలకూ అవసరమనీ, సరిపెట్టుకున్నాడనీ గ్రహించుకుంది. కొన్ని ఉమ్మడి కుటుంబాలలో ఇలాటి అంతర్నాటకాలూ, సర్దుబాట్లు సహజంగా సాగిపోతుంటాయనీ గమనించింది. కొత్త కోడలుగా, నోరు మెదపలేకపోయింది. కానీ, రాను రాను, ఇద్దరు ఆడపిల్లలకు తల్లిఅయ్యాకకూడా, తనకా ఇంట్లో ఏ పాటి స్వాతంత్ర్యంగానీ, తన పిల్లలకు ఏ ముద్దు ముచ్చటలుగానీ సాగకపోవటంతో, రామయ్య, లక్షమ్మ కేవలం తననో ''పనిమనిషి'గా ఉపయోగించుకోవటంతో, ఆమెలో అందాకా అణచిపెట్టుకొని వున్న అసహ్యం, కోపం కట్టలు తెంచుకున్నాయి. వేరుపడదామంటే రామయ్య ససేమిరా అన్నాడు! ఇక తన నిస్సహాయతను, తిట్ల రూపంలో బహిర్గతం చేసుకోవటం మొదలెట్టింది. భర్తతోటి కోడలి భాగవతాన్ని, బహిరంగంగా అల్లరిచేయటం ప్రారంభించింది. ఇంటిల్లిపాదికీ ఇదో తలనొప్పిగా మారిపోయింది. ఓ శుభోదయాన చద్దెన్నం తిన్న కొండమ్మ, అక్కడికక్కడే విరుచుకుపడి చచ్చిపోయింది. ఆమె తలిదండ్రులకు కబురు అందేలోగా, శవదహనంకూడా జరిగిపోయింది. ఆమె చావు గురించి చాలా కాలంవరకూ, ఎన్నో రకాల అనుమానాలూ, ఊహాగానాలూ జనంలో నిలిచిపోయాయి.

లక్షమ్మకు నలుగురు కొడుకులూ, ఒక కూతురూ వున్నారు. వాళ్ళతోబాటు రామయ్య కూతుళ్ళు సుబ్బులునూ. రాజ్యాన్నీ, పెంచింది. పెంచడమేమిటి? వాళ్లే పెరిగారు! జ్వరం తగిలి, హఠాత్తుగా కిష్టయ్య చనిపోవటంతో, ఇంట్లో మగపెత్తనం రామయ్యదీ, ఆడపెత్తనం లక్ష్మమ్మదీ అయిపోయింది. లక్షమ్మ కూతురికి పెళ్లైంది. ముమ్మూర్తులా తల్లిపోలిక వచ్చిన ఆమె-సంవత్సరంలో పదకొండు నెలలు పుట్టినింట్లో వుంటూ, ఒక నెల మాత్రం అత్తగారింట్లో అడుగు పెడ్తుంటుంది!

లక్షమ్మలో వయసు తగ్గేకొద్దీ, మరది ఆస్తి తన పేర, తన కొడుకుల పేర రాయించుకోవాలన్న తపన జాస్తయింది. అందాకా వస్తుందనుకోని రామయ్యకు తన కూతుళ్ళిద్దరిమీదా మమకారం పొంగి పొర్లింది. వాళ్ల భవిష్యత్తు బాగుండాలంటే, రాబోయే అల్లుళ్లకు సగం సగం ఆస్తి ఇచ్చి, తనూ వాళ్ళదగ్గరే వుండిపోవచ్చునన్న ఆలోచనలో పడ్డాడు. ఆ మాటే, తనకు ఆప్తుడినని తలిచే నాతో చాలామార్లు చెప్పాడు కూడా.

ఆరునెలల క్రితం. సుబ్బులును నరసింహులుకిచ్చి, పెళ్ళిచేశాడు రామయ్య. నరసింహులు అందగాడు తెలివిగలవాడు. చదువులేకున్నా సంస్కారం వున్నవాడు. లక్షమ్మ రోజూ చేస్తున్న గొడవనుబట్టి, అక్కడేవుంటే, రామయ్యకూ, అతని చిన్నకూతురికీ అగచాట్లు తప్పవని తెలుసుకున్నాడు. అడపా, తడపా, అత్తవారింటికొచ్చినపుడల్లా, మా ఇంటికివచ్చి; నాతో చనువు పెంచుకొని. నా అభిమానాన్ని సంపాదించుకున్నాడు.

''పంతులుగారూ! మా మామ బలహీనతేదో నాకు తెలుసు. అదే ఆయన్నిప్పుడు చిక్కుల్లో పడేస్తున్నది. బెజవాడలో ఒక సున్నపు బట్టీలో నాకు భాగముంది. అక్కడే ఏదైనా నౌకరీ చూసుకుని, నా భార్యతో బాటు, మామనీ, మరదల్నీ పిల్చికెళతానండీ! అప్పుడప్పుడూ వచ్చి ఇక్కడ నా వాటాకు మా మామ ఇస్తానన్న ఆస్తినీ, ఆయన ఆస్తినీ చూసుకుంటాను ఏమంటారు? పెద్దవయసొచ్చాక కూడా మా మామ ఈ రొంపిలోనేపడి-ఆమెకు భయపడ్తూ వుండటం నాకు బాగాలేదు ఏమంటారు?'' అన్నాడు మూడు నెలల్రక్రితం వచ్చినపుడు. నాకు చాలా సంతోషమనిపించింది. ఆ మాత్రం ఆలోచనా, ఆత్మవిశ్వాసం మనిషికి చాలా అవసరం.

''మంచిది!'' అన్నాను మనస్ఫూర్తిగా.

''అప్పుడే ఈ సంగతి ఎవరికీ చెప్పనండీ! మీరూ చెప్పకండి. ఆస్తులు రాతలు కోతలు అయ్యాక.... చెబుదాం! ఈ లోపల తెలిస్తే, మా పెద్దత్త, మా మామకూ, ఆయన కూతుళ్ళకూ, తిండికూడా పెట్టదు. తిట్టిపోస్తుంది! నా మరదలికి కూడా ఎవరైనా మంచి కుర్రాణ్ణి చూచి, అక్కడే పెళ్ళి చేస్తాను. మా మామను నా దగ్గరే వుంచుకొని సాకుతాను!'' అన్నాడు నవ్వుతూ.

ఆ కుర్రాడి మీద నాకెంతో అభిమానం, ఆస్తికోసం గాక, మానవతా దృక్పథంతో ఆలోచించగల యువకుడనిపించింది.

ఈలోగా, లక్షమ్మకు, మరిది ఆలోచన కొద్దిగా వాసన వచ్చింది. నరసింహులు ఇక తన మరిదిని, తన చేతుల్లోంచి లాగేస్తాడనీ, ఆ ఆస్తి ఇక దక్కదనీ పసిగట్టింది. నయానా, భయానా, రామయ్యనూ, సుబ్బులునూ, రాజ్యాన్నీ సాధించటం మొదలెట్టింది. ఆమెతో ఆమె కూతురు శృతి కలిపింది. సుబ్బులును తిట్లతో-కాపురానికి పంపింది. నెల తర్వాత సుబ్బులును ఇక్కడికి పంపి, నరసింహులు బెజవాడ వెళ్లాడు నౌకరీ కోసం.

''ఇంట్లో గొడవైపోయింది పంతులూ!'' అంటూ అప్పుడప్పుడూ రామయ్య చెబుతుంటే, మౌనంగా వింటుండే వాణ్ణి నేను.

ఆరోజు నాతో మాట్లాడి వెళ్లిన వెళ్ళటం

.... తిరిగి ఈ రోజు సాయంత్రం వచ్చాడు నరసింహులు. భార్యను పిల్చి కెళ్ళటానికి.


"పంతులూ! త్వరగా రా నాకేమిటో భయంగా వుంది!" అన్నాడు రామయ్య మళ్లీ. అందాకా, "మెడికల్ ఛెస్ట్" లో అవసరమైన మాత్రలు నర్దుతున్న నా మనసు లోని గతమంతా చెదిరిపోయి, వర్తమానం వెన్ను చరిచింది.

"ఏం భయం లేదులే రామయ్యా! వస్తున్నా పద!" అన్నాను. ఏ ఆధునిక సౌకర్యాలూ లేని ఈ కుగ్రామంలో, ఎలి మెంటరీ స్కూలు టీచరుగిరీతో బాటు, తాత ముత్తాతల నుంచీ వస్తున్న "ఆయు ర్వేదం" (ఆయుధంగా గాక) ఆలంబ వంగా చేసుకుని, బ్రతుకు తెరువు చూసు కున్నామ నేను. గ్రామాలలో కాస్తంత అభిమానంగా-పదుగురికీ తల్లో నాలుకలా, ప్రెసిడెంట్లకూ, ఎక్స్ ప్రెసిడెంట్లకూ, పార్టీలకూ, పగలకూ అతీతంగా బ్రతక దల్చుకున్న వాడికి ఇలాటి 'ద్విపాత్రాభి నయం" తప్పని సరి.

రామయ్య ఇంట్లో అడుగెట్టేసరికి, ఆ వరికే ఊళ్లోని చిన్నా, పెద్దా, ఆడా, మగా అంతా అక్కడే పోగయి వున్నారు. అతి కష్టం మీద వాళ్ళ మధ్యనుంచి తోవ చేసు కుంటూ వెళ్ళిన నాకు కనిపించింది మంచం మీద పడివున్న నరసింహులు శవం మాత్రమే! నోటినుంచి ప్రక్కలకు కారిన-కొద్దిపాటి రక్తం ... గడ్డ కట్టిందా వరికే! ఇస్త్రీ బట్టలలో, అత్తవారింటి కొచ్చిన హుషారులో, కొత్త భార్యతో సరాగాలాడే తియ్యని ఊహలలో .... సాయంత్రం వచ్చిన నరసింహులు- శాశ్వ తంగా వాటన్నిటికీ అతీతమైన దూరాలకు వెళ్ళిపోయాడు! తన మామ-పరదలి భవి ష్యత్తులను తీర్చి దిద్దుదామనుకున్న నర సింహులు, తన మృత్యువు ఇంత దగ్గర్లో వుందని బహుశా కలలో కూడా ఊహించి వుండడు.

చుట్టూరా జనం నరసింహులు "మంచి" ని గురించి రకరకాలు చెబు తున్నారు. నేను నాడి పట్టి చెప్పనవసరం లేకుండానే, వాళ్లంతా నరసింహులు చచ్చి పోయాడని రామయ్య మా ఇంటికి వచ్చిన మరుక్షణమే గ్రహించారు. నాకు ఎవరి మాటలూ వినిపించటం లేదు. నర సింహులు పడివున్న మంచానికి దగ్గరగా నేలమీద పడి ఏడుస్తున్న సుబ్బులు మొహం మాత్రం కనిపిస్తోంది! ఆ గుండ్రటి మొహం. పెద్ద కళ్లు, పొందికైన లావు, ఎత్తు....తీర్చిదిద్దిన దేవీ విగ్రహంలాటి, ఈ పద్దెనిమిదేళ్ల ముగ్ధ జీవితం...ఇక ఈనాటితో, భౌతికంగా కాక పోయినా, అంతమై పోయినట్లే! పెళ్లై ఆరు నెలలు ఇంకా నిండలేదు! ఒక్కనెల భర్తతో-సరిగ్గా పిగ్గు కూడా వదలకుండా.. కలిపి వుంది. ఆ నెల ఆమె గడిపిన తియ్యని జీవితానికి ఫలితంగా నెల తప్పి.. రెండవ నెల జరుగుతోంది! ఇక ఈ అమ్మాయి, తండ్రి ముఖంకూడా చూడని ఆ బిడ్డను కని, పెంచి పెద్దచేసి, ఇక ఆ జీవికి విముక్తి ఎప్పుడు? విధి అన్నది ఇంత క్రూరమైందా?

ఇక అక్కడ నిలబడలేక, గబ, గబా ఇంటికి వచ్చేశాను. అందాకా, ఎక్కడా పిసరంత కూడా లేని మబ్బు, ఎక్కణ్ణించి ముంచుకు వచ్చిందో, చుక్కలను మింగి వేసి, గాఢాంధకారాన్ని సృష్టించి, కుండ పోతగా వర్షం మొదలెట్టింది. చూస్తుండ గానే, సుబ్బులు జీవితంలానే, వాతావరణం భయంకరంగా, జుగుప్సాకరంగా మారి పోయింది. గ్రామమంతా ఏదో గంభీరత, మృత్యు శీతలచ్ఛాయ ఆవరించిందొక్క సారిగా. దైవం చేసిన ఈ వికృత లీలకు, ప్రకృతి భోరున ఏడుస్తున్నట్లుంది. పక్క మీద పడుకున్నానే గానీ నిద్ర రాలేదు.




సుబ్బులుకిక పెళ్ళి చెయ్యరు. ఈ వాతా వరణంలో, తరతరాల మూఢ నమ్మకాల ముసుగులో, చేసుకొంటామని ఎవరూ ముందుకు రారు. వచ్చినా, పెద్దలంతా అదేదో చేయరాని దారుణమని ప్రతిఘ టిస్తారు. సుబ్బులులోని అమాయకత్వమూ, అవివేకమూ కూడా, ఆమెని అంగీకరింప నివ్వవు. ఈ భర్త మరణం తాలూకు గాయం మానిన తర్వాత వయసు చేసే గారడీకి తట్టుకోలేక, చాటుమాటు ప్రణ యాలు,వాటి తాలూకు ఫలితాలు, అవి తొల గించుకోవటానికి నాటు వైద్యాలు, దుర్భర మైన శారీరక, మానసిక క్షోభ, అలా ఎన్ని రోజులు....నెలలు....సంవత్సరాలు? చీకటి తెరమీద, చేతగాని చిత్రకారుడు గీసిన ఒంకర టింకర రేఖా చిత్రంలాటి జీవితం. ఇక సుబ్బులుది!

తెల్లారేలోగా, ఆ జడి వానలోనే, కొందరు మనుషులు, నరసింహులు స్వగ్రా

మానికి వెళ్ళి, చావు కబురు చెప్పి, అతని తలిదండ్రులనూ, అన్నదమ్ములనూ, బంధువులనూ పిల్చుకు వచ్చారు. ఝాము పొద్దెక్కే సరికి, మరో వింత వార్త పొక్కింది. నరసింహులుకు, లక్షమ్మ, ఆమె కూతురూ కలిసి, అన్నంలో విషం పెట్టారని!

"అవునా? కాదా?" అని తర్జన భర్జనలు జరుగుతున్నంతలోనే, నరసింహులు తలితండ్రులు, అన్నదమ్ములూ, రామయ్యా, మరికొందరు గ్రామస్తులూ నా దగ్గరకు వచ్చారు.

"నువ్వొకసారి రావాలి పంతులూ! శవాన్ని బాగా చూడు. విషం పెట్టినట్లే వుంది. తేల్చి చెప్పు. ఆనక మేం తేల్చుకుంటాం!" అన్నారు ఉద్రేకంగా. కూతురి బ్రతుకు బుగ్గి అయిందన్న ఆవేదన, లక్షమ్మ ఏదో చేసి వుంటుందన్న అనుమానం, రామయ్యలో ముమ్మరంగా నిండి వున్నాయి.

శవం నోటివెంట రక్తం కొద్దిగా రావటమన్నది, వీళ్ళంతా విష ప్రయోగంగా తేల్చమంటున్నారు. కానీ రక్తనాళాలు పగలటం వల్లా, విషప్పురుగులు కాటెయ్యటం వల్లా కూడా, నోటివెంట, ముక్కుల వెంటా రక్తమూ, తెల్లని నురుగూ, నల్లటి ద్రవమూ రావొచ్చు. ఏదైనా పోస్టుమార్టం చేస్తే తప్ప ఎవరూ తేల్చి చెప్పలేరు.

"ఇది విషప్రయోగం కాదేమో?" అంటే, లక్షమ్మ తనకు రాబోయే ఆస్తిలో నాకూ వాటా పెడతానన్నది కాబోలన్న నిందాప్రచారం క్షణాలమీదసాగి, కొత్త కథలకు పునాదివేస్తుంది. "ఇది విష ప్రయోగంలానే వుంది!" అన్న సంశయాత్మకమైన ఒక్కముక్క నా నోటెంట వెలువడిందా, ఇక - లక్షమ్మనూ ఆమె పిల్లలనూ నడివూళ్ళో నిలువునా కర్రలతో బాది చంపేస్తారు!

ఒక్కక్షణం ఆలోచించి మెల్లగా చెప్పాను. "ఏదో చిన్నచిన్న వైద్యాలయితే చెయ్యగలనుగానీ, ఇలాటివి ఖచ్చితంగా తేల్చి చెప్పలేను. అనుమానాలుంటే, శవాన్ని బస్తీకి తీసికెళ్ళి పోస్టుమార్టం చేయించండి."

అందరికీ ఇది నచ్చింది. ఏదో పెద్ద దారుణకాండ సరదాగా చూద్దామనుకున్న వారికి కొందరికి మాత్రం నా సలహా బొత్తిగా నచ్చలేదు సరికదా కంటకంగానూ వుంది.

ఆ రోజంతా వర్షం కురుస్తూనేవుంది. శవాన్ని బస్తీకి తీసికెళ్ళమని కొందరూ, వద్దని కొందరూ వాదించుకొంటూనే వున్నారు. వద్దన్న వారిలో ఎక్కువమంది కాస్త ఆలోచనాపరులు. బస్తీకి తీసికెళ్ళి - పరీక్ష చేయించాక, విషం కాదని తేలితే, ఇక లక్షమ్మ, ఆమె పిల్లలు, ఊళ్ళోని అవకాశవాదులు దుమ్మెత్తిపోస్తారు. అలా గాక, ఇలా అనుమానంతోనే శవాన్ని పారేస్తే, జీవితాంతం లక్షమ్మనూ, ఆమె కూతుర్ని, నిందిస్తూవుండగల అవకాశాన్ని చేజిక్కించుకొంటారు.

మర్నాడు ఉదయానికి వర్షం తగ్గింది.


*With Best Compliments from :*

**Dial : 446278** **Cable : THEEBY**

# THEEBY JEWELLERS

*Dealers in :* **GOLD JEWELS & DIAMONDS**

**'STAR BAZAR'**

**15, Ranganathan Street, T' Nagar,**

**MADRAS-600 017.**

**For Latest Designs in Gold Ornaments and Diamond Jewellery**

బంధువులలో అందరికీ ఏడ్చే ఓపికలూ తగ్గాయి. కొద్దిగా ఉబ్బిన శవాన్ని, కాస్తంతగా వస్తున్న దుర్వాసననూ తప్పించుకొనే మార్గంకోసం వెతకటం మొదలెట్టారు. గ్రామపెద్దలు జోక్యం చేసుకున్నారు. శవాన్ని రోజుల తరబడి ఊళ్లో వుంచటం ఊరికి మంచిది కాదని కేక లేపారు. దాంతో, ఇక తప్పని సరి అన్నట్లుగా, అందరూ రాజీపడి శవాన్ని దహనంచేసివచ్చారు. మూడు రోజులుగా, మనిషి మనిషి పలకరింపుతో - ఏడుపు వచ్చినా, రాకున్నా, ఏడ్చిన సుబ్బులు (ఆమె భర్తమీద ఆమెకు ప్రేమవున్నా, ఈ విధిలేని "ఏడిపించటం" ద్వారా అది కాస్తా చచ్చిపోయినట్లుంది!) ఇక పలకటానికూ_డా ఓపికలేక, సొమ్మసిల్లినట్లు పడిపోయింది. అంతటితో, ఆ అంకం ముగిసిందనుకున్నాను. కానీ సుబ్బులు జీవితకథ కింకా ముగింపు దొరకలేదల్లే వుంది సృష్టికర్తకు.

భర్త చనిపోయిన మూడవ నెలవరకూ, సుబ్బులు అత్తవారింట్లోనే వుండాలని, నరసింహాలు తలితండ్రులామెను పిల్చి కెళ్లారు.

"మా మరదలకి వాళ్ల పెద్దమ్మచేసిన ఘోరం అంతా ఇంతా కాదు. ఆ పిల్లని పుట్టినింట్లోనే వుంచితే, ఎప్పుడో, ఆమెకూ, ఆమె చెల్లెలికీ, తండ్రికీ కూడా విషం పెట్టేస్తుంది వాళ్లపెద్దమ్మ, ఆస్తి కోసం. నా తమ్ముడొకటీ, నా తమ్ముడి భార్య ఒకటీ కాదు నాకు! సుబ్బుల్ని నా దగ్గరే వుంచుకుంటాము. ఆమె చెల్లెలిని, నా మరో తమ్ముడికిచ్చి చేసుకుంటాం. ఆమె తండ్రినీ మా దగ్గరే వుంచుకుంటాం!" అంటున్నాడట సుబ్బులు బావ (భర్త అన్న). అదే సమర్థిస్తున్నారట సుబ్బులు అత్తమామలూ, బంధువులూ.

లోకం తెలియని సుబ్బులు "అవునవును. నే నిక్క_డేవుంటాను!" అంటోందట. రామయ్య, మరో నలుగురైదుగురు యువకులూ (రామయ్య బంధువర్గంలోని వాళ్ళు) పైమాటలు చెప్పటానికి వచ్చారు నాతో.

"పుట్టి పెరిగినగ్రామం ఇది పంతులూ! నే నొదిలి వెళ్ళలేను!" అన్నాడు రామయ్య. అతనిలో ఇప్పుడు కూతురి భవిష్యత్తును గురించిన ఉద్వేగం కొంత తగ్గినట్లుంది.

రామయ్యకేసి విదానంగా చూశాను. ఆ మాటలలో నిజాయితీ కనిపించలేదెందుకో. పుట్టిపెరిగిన గ్రామాన్నేకాదు, లక్షమ్మతో, ఆమె పిల్లలతో పెంచుకున్న అనుబంధాన్ని కూడా ఇతగాడు తెంచుకోలేడనిపిస్తోంది.

"ఎందుకు పంతులూ! రామయ్య మామ ఇంతగా బాధపడటం? మే మంతా లేమా? పుట్టిపెరిగిన వూరొదిలి, పరాయి వూళ్ళో, పిల్లనిచ్చిన వాళ్ళ దగ్గర పడి వుండటం ఎంత నామోషీ! ఇక్క_డే వేరే ఇంట్లో వుంటాడు. సుబ్బులయినా ఎల్లకాలం అత్తగారింట్లో వుండటం పనికాదు. బావలూ, మరదులూ అంతా పడుచు

*Hearty Diwali Greetings*

**Phone : 75928** **Grams : ANENCOYL**

# The Anchra Engineering Co. Private Ltd.,

**24-8-5 P. V. Raju St., Ramnagar,**
**VIJAYAWADA-3.**

*Distributors :*
**INDIAN OIL CORPORATION LTD.,**
*Stockists :*
**" RAMCO " Asbestos Cement Products**
**AND**
**Transport Contractors**

కుర్రాళ్లు. మనపిల్ల మంచిదయినా, లోకం నోరు మంచిగా వుంటుందా? వాళ్ళ బావ కయినా ఎల్లకాలం ఈ ప్రేమ వుంటుందా మరదలిమీద? ఆస్తి మరొకళ్ళకు పోకుండా, తమలో కలుపుకోవాలని ఎత్తు వేస్తున్నారుగానీ! ఎట్లాగూ కడుపుతో వుంది. పోయినవాడి ప్రతిబింబంగా బిడ్డను చూచుకుంటూ, పెంచుకొంటూ, తండ్రి కింత ఉడకేసిపెడుతూ ఇక్కడే వుంటుంది. రాజ్యాన్ని మా ఇలాకాలో ఎవరికో ఒకరికి ఇచ్చి చేసుకున్నామంటే, మా మధ్యనే వుంటారు తండ్రీ కూతుళ్లు. వెధవ ఆస్తి దేమిటి? మనుషులు కావాలి గానీ!'' అన్నారా యువకులంతా, కొద్దిగా మాటల తేడాతో.

అందరికేసీ చూశాను. సుబ్బులు చుట్టూరా వర్తులాకారంలో, మనుష్య రూపాలలో వున్న రాబందులూ నక్కలూ! గద్దలూలా కనిపిస్తున్నారు. ''వెధవ ఆస్తి'' అంటూనే ఆస్తికోసం వేసే గాలాలు! సుబ్బులును ఉద్ధరించే అవతార పురుషులు పోజులు! సుబ్బులు బావయినా అంతే! వీళ్లయినా అంతే! కన్నతండ్రి తోనే, అంతర్గతమైన స్వార్థం కరుడు గట్టివుండగా, ఇక మిగతా వారిలో స్వార్థంగాక మరేముంటుంది?

వీళ్ల మధ్యనుంచి సుబ్బులు నెలా కాపాడటం. ''వీళ్లెవరినీ నమ్మొద్దు సుబ్బులూ! నీకు నచ్చినవాణ్ణి, నిన్ను మెచ్చేవాణ్ణి నీ మనసు సర్దుకున్నాక పెళ్లాడు. వీళ్ళ స్వార్థానికి బలికావొద్దు!'' అని చెప్పాలని వుంది. ఈ వాతావరణంనుంచి ఆమెను తప్పించాలని వుంది. తప్పించి? బస్తీలో - ఏదేనా స్త్రీ సంక్షేమ సంస్థల లోనో వుంచితే? అక్కడ మాత్రం? సుబ్బులులాటి అమాయకురాలినీ, అందం గల ఆడపిల్లనూ ఎరవేసి, సర్వనాశనం చేసే స్వార్థపరులు లేరా?

''ఏమంటావు పంతులూ?'' వాళ్లంతా ప్రశ్నిస్తున్నారు. వాళ్ళొచ్చింది నా అంగీకారంకోసంకాదు. ఆసరికే నిర్ణయించుకొనే వచ్చారు. 'పంతులుకూడా మామాటేమంచి దన్నాడు!'' అన్న ప్రచారము కోసమే!

''నే నేమంటాను? అయినా సుబ్బులునుకూడా ఒకమాట అడిగి....'' నా మాట పూర్తి గాకముందే, అందరూ నవ్వారు. ''....దానిమొహం! దా న్నడిగే దేమిటి?'' అందరూ వెళ్ళిపోయారు.

తర్వాత నెలరోజులకు సుబ్బులు వచ్చింది. గర్భిణిగా...పూర్తిగా వికసిస్తున్న 'పువ్వులా' ఆమె అందం ద్విగుణీకృత మైంది. సుబ్బులు, రాజ్యం, రామయ్య వేరేఇంట్లో వుంటున్నారు. కానీ, రామయ్య మాత్రం లక్ష్మమ్మతో, ఆమె పిల్లలతో ఏమీ జరగనట్లే కలిసిమెలసి వుంటున్నాడు. ఎవరైనా నరసింహులు మరణం గురించి అడిగినా ''ఆం ఆయుస్సు లేకపోయాడు'' అనేస్తున్నాడు నిర్లిప్తంగా. మనుషులింత త్వరగా తమ గాయాలని మర్చిపోగలరు కాబట్టే, దేవుడు వాళ్ళకి తరచూ గాయాలు చేస్తూనే వుంటాడేమో?

ఇప్పుడు సుబ్బులు (రామయ్య) ఇంటి చుట్టూరా, ఎందరో శ్రేయోభిలాషులు,



*With the best compliments from :*

Telephones : 433004
433005

**AMCO ENGINEERING CORPORATION**

SUPER A19 ; INDUSTRIAL ESTATE,

MADRAS-600 032



# లోచనాలోచనాలు

వైవియల్యన్!

వెన్నెల చిదిమి తీసింది కాంతి గీతం!
వేదన చిలికి బాధను త్రచ్చి
గుచ్చెత్తిన దీ గీతం!
ఎన్ని కళ్ళు? ఎన్ని కళ్ళు?
ఎన్నాళ్ళు మోస్తారు వారా కన్నీళ్ళు?
ఎన్నాళ్ళు చూస్తారు
ఎంతకీ అంతంలేని ఎదురుతెన్నులు?
చూసి చూసిన
ఆ కళ్ళల్లో
జ్వాలా కీలికలు! ఆశా మాలికలు!
సడి లేని సవ్వడులు! తుది లేని పల్లవులు!
ఎన్ని కళ్ళు? ఎన్ని కళ్ళు?
ఆ కళ్ళ వెనుక
ఎన్ని దిగుళ్ళు? ఎన్ని ఆశల పగుళ్ళు?
ఆశల బీజం మొలకెత్త వలసిన చోట
బీడుగా మారిన పెను గోడు
ఆనందం ననలెత్త వలసిన ఈ నేత్రాల
అనంత కోటి బాధల ఛాయా చిత్రాలు!
ఎన్ని కళ్ళు? ఎన్ని కళ్ళు?
ఆ కళ్ళ నిండా
కష్టాల కడగండ్లు! కన్నీటి వడగళ్ళు!
అవి కళ్ళు కావు!
నిరంతరం నిరాశ చిప్పిల్లే నిర్విరామపు సెలవళ్ళు!
అహరహం ఆర్తితో అలమటించే శోకపు లోగిళ్ళు!
ఆ కన్నులు—
మూగ బొమ్మలు! మోడు రెమ్మలు!
ఎన్ని కళ్లు? ఎన్ని కళ్లు?
ఏదో శాపం పొందినట్లు! పాపం చేసినట్లు!
వణుకుతూ! వణుకుతూ!
కరుగుతూ! కరుగుతూ!
చలిత కాంతుల వోలె! విచలిత కాంతల వోలె!
సితాసిత భ్రమ స్ఫురిత
మెరుపుల వలె! మిత్తిక వలె!
ఎన్ని కళ్లు? ఎన్ని కళ్లు?
వెలిగి మలిగే దీపాలలాగా!
విరిసి ఒరిగే సుమాలలాగా!
ఎన్ని కళ్లు? ఎన్ని కళ్లు?
నేను చూస్తుంటాను
వాటినే రేయింబవళ్లు!

★★★

---

మరెందరో వలహాదారులు తిరుగుతున్నారు. రామయ్యకు పేద్యపు పనులలో ఎంతో సహాయం చేస్తున్నారు. రాజ్యం సక్రమంగా, పేలగా, మెల్ల కన్నుతో, అసహనంగా వున్నా. ఆ పిల్లని పెళ్ళాడటానికి పోటీలు పడ్తున్నారు కొందరు యువకులు. ఆ యువకుల తరఫున వారిపెద్దలు సంప్రదింపులు జరుపుతున్నారు,

రామయ్య కిప్పుడు విశ్రాంతగా వుంది; హాయిగా వుంది.

నాకుమాత్రం అప్పుడప్పుడూ నిద్ర పట్టని రాత్రివేళ....చిక్కగా పరుచుకున్న చీకటిలో, నల్లని చీకటి తెరమీద, సుబ్బులు జీవితక....భవిష్యత్తుకథ, నలుపు తెలుపు చిత్రంలా కనిపిస్తుంటుంది.

సుబ్బులుతోబాటు దేశమాత రూపం కూడా కనిపిస్తుంది. ఆ తెరమీదే: కల్తీ మందులు, కల్తీ ఆహారపదార్థాలు, అభినవ ధన్వంతరులు, అవినీతి, అధికారదాహం బ్లాక్‌మనీ, కుంటుపడిన ప్రగతి, ఎన్నో ఒంకరటింకర చీకటి గీతలమధ్య చిక్కుబడిపోయిన దేశమాత, ఆమెకు అణువణువునా ఇంజెక్టు చేయబడిన, చేయబడుతున్న స్లో-పాయిజన్ వికృతమై శిథిలమైన ఆమె లావణ్యం....

అదంతా చూస్తూ ఏమీ తెలియనట్లు నటిస్తున్న దేశనాయకులు, మౌనం వహించిన మేధావులు, వుద్యోగపు చక్రాలలో బిగిసిపోయి, నిస్తేజులైన మధ్యతరగతి ఆలోచనాపరులు, దిష్టి బొమ్మలలా కనిపిస్తుంటారు....

అంతలోనే సుబ్బులు బొమ్మ.

ఆమె చుట్టూరా వెదజల్లబడుతున్న "స్లో-పాయిజన్" మరి కొన్నేళ్లలో ఆమెలోని అభిమానాన్ని అందాన్ని, స్త్రీత్వాన్ని చివరకు శరీరాన్ని కూడా మిగల్చకుండా చంపివేస్తుందని నాకు తెలుసు.

కానీ ఓ బడిపంతుల్ని, అదితప్ప జీవనాధారం లేనివాణ్ణి పార్టీలకూ పదవులకూ అనుక్షణం మొక్కవలసినవాణ్ణి, సగటు మధ్యతరగతి జీవిలాగే "మనస్సాక్షి" ని చంపుకుంటున్నవాణ్ణి, సుబ్బులు బ్రతుకును స్లోపాయిజన్ నుంచి ఎలా రక్షించటం? ఆలోచించటం, సాక్షీభూతంగా చూస్తూ వుండటం, దిష్టిబొమ్మలా నిల్చుని చూడటమే తప్ప—ఏం చేయగలను? ★★★